క్లుప్తంగా

బాధితులకు తోడ్పాటు



బాధితులకు సరకులు అందజేస్తున్న దాతలు

కడప కల్చరల్: కడప రవీంద్ర నగర్‌లో ఈ నెల 20న గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటనలో బాధితులు శ్రీరాములు, నందిని కుటుంబాలకు లకు మానవతా సేవా సంస్థ నగర శాఖ నెలకు సరిపడా వంట సరుకు, రూ.2 వేల సాయం శుక్రవారం అందించింది. ఈ కార్యక్రమంలో రాటాల గోపి, డాక్టర్ సి.సుబ్బారెడ్డి, బీవీ.సుబ్బారాయుడు, అవ్వారు సుబ్బయ్య, సమ్మెట సత్యనారాయణ, కొండా రెడ్డి, చలమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

23న కాల భైరవ జయంతి



కాలభైరవస్వామి

కడప కల్చరల్: కడప నగర శివారులోని కాల భైరవపురం(ఎమ్మెస్ కొట్టాల)లోని ఇష్ట కామ్యార్థ కాలభైరవ స్వామి దేవస్థానంలో ఈ నెల 23న సోమవారం స్వామి జయంతి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మేరువ బాలాజీరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు అభిషేకం, 9 గంటలకు కూష్మాండ దీప సేవారాధన, 10 గంటలకు హోమం, 12 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

అంధకారంలో టిడ్కో-2 లే అవుట్

కడప కార్పొరేషన్; కడప నగరంలోని సెంట్రల్ జైలు వెనక ఉన్న టిడ్కో- 2 లే అవుట్ జగనన్న కాలనీ అంధకారంగా మారింది. ఇక్కడ వీధి దీపాలు అమర్చారు కానీ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో వీధులలో కటిక చీకటి అలుముకుంది. అసలే అడవికి దగ్గరగా ఉండడంతో విష పురుగుల సంచారం ఎక్కువగా ఉండడంతో స్థానికులు ఆదోళనలకు గురవుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి వీధి దీపాలు వెలిగేలా చూడాలని వారు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తా



హృషీకేశవరెడ్డి

కడప కార్పొరేషన్: మున్సిపాలిటీల పరిధిలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి తనపై నమ్మకముంచి పదవి ఇచ్చిన నాయకుల ఆశయాలు నెరవేరుస్తానని తెలిపారు.

స్వయం ఉపాధితో ఎదగాలి



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రతి మహిళ స్వయం ఉపాధితో ఎదగాలని ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి తెలిపారు. కడప నగరంలోని ఉక్కాయపల్లెలో ఉన్న దాదాస్ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు పీఎం రవికుమార్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ రవికుమార్ మహిళలను చైతన్య వంతులు చేసేలా కుట్టుమిషన్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మహిళలు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో దాదాస్ సంస్థ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

వర్షం వస్తే చిత్తడి



బస్టాండు ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అల్పపీడన ప్రభావంతో కడపలో కురిసిన వర్షంతో ఆర్టీసీ బస్టాండులో నీరు నిలిచింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షపునీరు నిలబడి ఉండడంతో ప్రయాణీకులు ఇబ్బందిపడ్డారు. బస్సుల రాకపోకలకు సంబంధించి ఒకే గేటు ఉండడంతో పార్సిళ్ల బుకింగ్‌కు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నేడు విస్తృత స్థాయి సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా రీజినల్ విస్తృత స్థాయి ఎంప్లాయీస్ యూనియన్ సమావేశాలు శనివారం నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా ఎనిమిది డిపోలకు చెందిన కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బందికి నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఉదయం 10.00 గంటలకు సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్యలు హాజరవుతారన్నారు. ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కడప నగరంలో క్రైస్తవ వీధులు

దేవుడి పేరు.. భక్తి భావం స్ఫురించే పేర్లతో ఎన్నో ఊళ్లు ఉన్నాయి. ఈ కోవలోనే కడప నగరంలో క్రైస్తవులకు ప్రత్యేకంగా నాలుగు వీధులు ఉన్నాయి. క్రైస్తవులు ఎక్కువగా ఉండడంతో ఆ వీధులు ఎంతో ప్రాచుర్యం సాధించాయి. క్రిస్మస్ పండుగ సందర్భంగా వాటి గురించి ప్రత్యేక కథనం..



క్రిస్టియన్‌లేన్

కడప కల్చరల్: పాత రిమ్స్ వద్ద నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు దాదాపు వంద మీటర్లకు పైగా ఉన్న ప్రాంతాన్ని క్రిస్టియన్ లేన్‌గా పిలుస్తారు. 1980 వరకు ఆ వీధుల్లో ప్రముఖ క్రై స్తవులు నివసించేవారు. ప్రస్తుతం ఈ వీధి నర్సింగ్ హోంలతో నిండిపోయింది. ఆ వీధికి ఈ పేరు రావడానికి చారిత్రక నేపథ్యం ఉంది. 1821లో బళ్లారి ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చిన క్రైస్తవ మత ప్రచారకుడు హావెల్ కడప నగరంలో లండన్ మిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం సొసైటీ ఫర్ ది ప్రొపగేషన్ ఆఫ్ గ్యాస్పెల్ సంస్థలో సభ్యుడిగా చేరారు. ప్రస్తుతం పాత రిమ్స్ ప్రాంతంలో కాంగ్రిగేషనల్ చర్చి నిర్మించారు. తనను అనుసరిస్తున్న స్థానిక క్రైస్తవులకు ఆయన అక్కడి నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు ఇళ్లు నిర్మించారు. ఆ వీధికి ఆయన క్రైస్తవుల పేటగా నామకరణం చేశారు. దాన్నే నేడు క్రైస్టియన్ లేన్‌గా పిలుచుకుంటున్నాం.

రాజారెడ్డి వీధి: రామనపల్లెకు చెందిన రైతు రాజారెడ్డి 1947–48లో వ్యాపారం కోసం కడప నగరంలో నివాసం ఏర్పాటుచేసుకున్నారు. తరచూ రైల్వే స్టేషన్ వెళ్లేందుకు అనువుగా ఉన్న ప్రాంతంలో ఉండేందుకు తనకు తోడుగా మరికొందరిని ఆహ్వానించి నివాసగృహాలను ఏర్పాటుచేశారు. అప్పట్లో పంట పొలాలుగా ఉన్న ఆ ప్రాంతాన్ని వారు నామ మాత్రపు ధరకు కొన్నారు. మరికొందరు పేదలకు రాజారెడ్డి ఉచితంగా ఇళ్ల స్థలాలిచ్చారు. అప్పటికే ఆ ప్రాంతానికి సమీపంలో సియోనుపురం ఏర్పాటై ఉండడంతో అక్కడి నుంచి మెయిన్ (స్టేషన్) రోడ్డు వరకు క్రైస్తవులు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. రామనపల్లె రాజారెడ్డి అభివృద్ధి చేసిన ప్రాంతం గనుక దానికి రాజారెడ్డి వీధిగా పేరు స్థిరపడింది.

● మరియాపురం

కడప నగరంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు ఉన్న ప్రాంతం మరియాపురం. ఇక్కడ ప్రధాన చర్చి కూడా ఉంది. 1937లో ఫాదర్ క్రంబ్లిష్ జిల్లాకు వచ్చారు. నగరానికి దూరంగా, ప్రశాంతమైన వాతావరణంలో క్రీస్తు ప్రార్థనా మందిరాన్ని ఏర్పాటుచేసుకుని అక్కడే నివాసం ఉండేవారు. ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలు చర్చికి వచ్చి ప్రార్థనలు చేసుకునేవారు. క్రమంగా భక్తుల సంఖ్య పెరగడంతో ఆయన ఆహ్వానంతో ఆ ప్రాంతంలో మరింతమంది క్రైస్తవులు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కాలక్రమంలో ఆ ప్రాంతం బాగా అభివద్ధి చెందింది. లోకరక్షకుడైన ఏసుక్రీస్తును ఈ లోకానికి అందించిన మహిమగల తల్లి మరియమాత పేరిట ఫాదర్ క్రంబ్లిష్ మరియపురం అన్న పేరు పెట్టారు. అనంతరం మరియాపురం ప్రథమ మేత్రాసన అధిపతిగా వచ్చిన ఫాదర్ ఎస్‌ఏ.అరుళయ్య చొరవ తీసుకుని ఆ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేశారు.



రాజారెడ్డి వీధి

● సియోనుపురం

రాజారెడ్డి వీధికి ఉత్తరం వైపుగల సియోనుపురం ప్రాంతాన్ని అప్పట్లో రిజర్వుడు పోలీసు హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన చిలంకూరు జోసెఫయ్య అభివృద్ధి చేశారు. ఆయన సహకారంతో (ప్రస్తుతం సియోనుపురం) ఈ ప్రాంతంలో పోలీసులు నివాస గృహాలను ఏర్పాటు చేసుకున్నారు. జోసెఫయ్య తన ఇంటి వద్ద పెంతకోస్తు ప్రార్థనా మందిరాన్ని ఏర్పాటు చేశారు. క్రమంలో ఆ మందిరానికి వచ్చే క్రైస్తవుల సంఖ్య పెరగడంతో దాన్ని పెద్ద మందిరంగా అభివృద్ధి చేశారు. అప్పట్లో హైదరాబాద్ నుంచి కడపకు వచ్చిన బెయేర్షబా వ్యవస్థాపకులు భక్తసింగ్ తమ వంతు సహకారం అందజేశారు. జోసఫయ్య ఆ ప్రాంతానికి సియోనుపురం అని పేరు పెట్టారు.



సియోనుపురం మూడు రోడ్ల కూడలి

ఆలయ పాలక మండలి నియామకం

కడప కల్చరల్: రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఆదేశాల మేరకు కడప నగరం చిన్నచౌక్‌లోని వీరాంజనేయస్వామి ఆలయానికి పాలక మండలిని శుక్రవారం నియమించారు. ఆలయ చైర్మన్‌గా కె.నారాయణ, అధ్యక్షుడిగా కె.నాగరాజ, ఉపాధ్యక్షుడిగా కె.మహేష్, కోశాధికారిగా కె.శివప్రసాద్‌లను నియమించారు. సభ్యులుగా కె.శ్రీనివాసులు, కె.అనిల్, కె.ఆంజనేయులు, ఎస్.శ్రీనివాసులు, కె.వేణుగోపాల్, జీవీఎస్ ప్రసాద్, ఎస్.అమర్‌నాథరెడ్డి, పి.రమణారెడ్డి, ఎస్.సాంబశివారెడ్డి, టి.వెంకట మనోహర్‌రెడ్డిలను నియమించారు.

మరో రెండు ఆలయాలకు

కడప నగరంలోని మరో రెండు దేవాలయాలకు పాలక మండలి నియామకం జరిగింది. స్థానిక మోచంపేటలోని ప్రసన్న విశ్వేశ్వరస్వామి, మృత్యుంజయకుంటలోని మృత్యుంజయేశ్వర స్వామి ఆలయాలల్లో నూతన పాలక మండలి ఏర్పాటుకు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ దేవాలయాలకు పాలక మండలి చైర్మన్, అధ్యక్షులు, సభ్యులుగా ఉండేందుకు ఆసక్తిగల ధార్మికవేత్తలు 20 రోజుల్లోగా దరఖాస్తులు పంపాలన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తాం



వి. రామక్రిష్ణారెడ్డి

కడప కార్పొరేషన్: జిల్లాలో వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆ పార్టీ సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన వెల్లాల రామక్రిష్ణారెడ్డి తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన తెస్తానని చెప్పారు.

మైనార్టీలకు మేలు చేసింది వైఎస్ జగనే



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: ముస్లిం మైనార్టీలు, క్రైస్తవులకు మేలు చేసింది మాజీ ముఖ్య మంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేతలు షఫీ, డీజే అక్బర్‌అలీ, క్రిష్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షడ్రక్‌రాజు తెలిపారు. తమ పార్టీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ ఇమామ్, మౌజన్‌లకు కూటమి ప్రభుత్వం తీపిక బురు చెప్పిందని ప్రచారం చేయడం వింతగా ఉందన్నారు. ఇమామ్‌లకు రూ.5 వేలు, మౌజన్‌లకు రూ.10 వేలు సాయం చేసింది మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆ పథకాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 10మంది మైనార్టీలకు కార్పొరేషన్ చైర్మెన్ పదవులు కట్టబెట్టారని, ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు, శాసన మండలి డిప్యూటీ ఛైర్ పర్సన్ వంటి కీలక పదవుల్లోనూ తమ వారిని నియమించారన్నారు. 2019లో ఐదుగురు మైనార్టీలకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారని, వారిలో ఒకరు ఓడిపోతే అతనికి ఎమ్మెల్సీ ఇచ్చారన్నారు. 2024 ఎన్నికల్లో ఏడుగురికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారని గుర్తుచేశారు. హజ్‌కు వెళ్లే యాత్రికులకు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సబ్సిడీ ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మైనార్టీలకు రూ.లక్షల వరకూ వడ్డీలేని రుణం ఇస్తామని, మసీదుల నిర్వహణకు నెలకు రూ.5 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇచ్చిన ఏ ఒక్కటీ అమలు చేయలేదని తెలిపారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల కోసం అన్ని పథకాల ద్వారా రూ.35 వేల కోట్లు వినియోగించారని చెప్పారు. పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అహ్మద్‌బాషా, బండి ప్రసాద్ పాల్గొన్నారు.

మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి



ధ్యానం గురించి వివరిస్తున్న రాజయోగిని బ్రహ్మకుమారీ శివలీల

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రతి ఒక్కరూ మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని విశాఖ పట్టణం రాజయోగిని బ్రహ్మకుమారి శివలీల తెలిపారు. ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఆర్టీసీలో పనిచేస్తున్న కండక్టర్లు, డ్రైవర్లకు ఒత్తిడి లేని జీవిత ప్రయాణం అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక సబ్ జోన్ అదనపు ఇన్‌ఛార్జి రాజయోగిని బ్రహ్మకుమారి గీతా బెహన్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఒత్తిడి వల్ల జీవితంలో సుఖ శాంతులను పోగొట్టుకుంటారన్నారు. ఒక విషయాన్ని ఒకే రకంగా ఆలోచించడం, చూడడంతో మనస్సు అలజడి, ఆందోళనకు గురవుతుందన్నారు. ప్రతి రోజూ 15 రోజులు ధ్యానం అభ్యసనం చేస్తే విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రశాంతమైన జీవనాన్ని గడపగలరన్నారు. ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్, ఆర్ఎం గోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న శిక్షణ ఎంతో ఉపయోగకరమన్నారు. కార్మికులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించేందుకు ధ్యానం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డ్రోన్ ఎంతో ఉపయుక్తం

కడప ఎడ్యుకేషన్: నేటి ఆధునిక కాలంలో రైతులకు ఆదాయం పెంపుతోపాటు అధిక ఉత్పత్తికి డ్రోన్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ప్రోగ్రాం కన్వీనర్ అండ్ హెచ్‌ఓడి విజయ కిషోర్ పేర్కొన్నారు. కడప నగర శివారరులోని కెయస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డిపార్టుమెంట్ నిర్వహించిన «వన్ వీక్ నేషనల్ వర్క్ షాప్ ఆన్ డ్రోన్స్ ఇమేజెస్ ఫర్ అగ్రికల్చర్ డెవలప్మెంట్» కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గెస్ట్ ఆఫ్ హానర్ విజయ్‌కిషోర్ డ్రోన్లు నిర్మాణం, నియంత్రణ, నావిగేషన్ పద్ధతులు, భద్రత నియమాలు, వ్యవసాయం, సర్వేయింగ్, మరియు ఫోటోగ్రాఫ్‌లో డ్రోన్లు ఉపయోగాలు గురించి వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వివిఎస్ఎస్.మూర్తి మాట్లాడుతూ డ్రోన్ ద్వారా వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం రైతు తమ పంట దిగుబడి, వాస్తవ పరిస్థితిని, భవిషత్తు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగ పడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టీఎస్.ప్రసాద్, అరుణ్ కుమార్, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు

ప్రశాంతంగా పదోన్నతుల కౌన్సెలింగ్



పదోన్నతి కౌన్సెలింగ్‌లో పత్రాలను పరిశీలిస్తున్న డీఈఓ కార్యాలయ సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: కడప మున్సిపల్ కార్పొరేషన్, పొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్స్, తత్సమాన క్యాటగిరి ఉపాధ్యాయులకు శుక్రవారం కడప డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన పత్రాల పరిశీలనతోపాటు పదోన్నతి కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఇందులో భాగంగా కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 6 మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతిని కల్పించారు. ఇలాగే పొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో 7 మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతిని కల్పించారు. మొత్తంగా 13 మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించినట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యాఖ్యలపై అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్ పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్ సర్కిల్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీపై తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం శోచనీయమన్నారు. రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను కించపరచడం దేశ ప్రజలందరూ వ్యతిరేకించాల్సిన అంశమన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో కమల్, అమిద్ , రహమతుల్లా ఖాన్, జహూర్, కిషోర్, దినకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి వంద పుస్తకాలు



పుస్తకాలను అందజేస్తున్న దాత

కడప కల్చరల్: సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి శుక్రవారం వంద పుస్తకాలు అందాయి. ప్రొద్దుటూరుకు చెందిన రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ వై.సుబ్రహ్మణ్యం వీటిని గ్రంథాలయ సహాయకులు ఎస్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణలకు అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం అందించిన పుస్తకాల్లో ఆధ్యాత్మిక, చారిత్రక పుస్తకాలతో పాటు విలువైన శతక గ్రంథాలు ఉన్నాయని తెలిపారు. పలు ఆధ్యాత్మిక క్షేత్రాల వివరాలుగల పుస్తకాలు, ఇతిహాసాలు, పురాణాలు, వ్యాకరణ గ్రంథాలు కూడా ఉన్నాయన్నారు. పుస్తకాలను బహూకరించిన వై.సుబ్రహ్మణ్యంను యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అభినందించారు.

లక్ష్మీనారాయణకు పురస్కారం

కడప రూరల్: అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్రం సాహిత్య అకాడమీ పురస్కారం ఇవ్వడంపై అభ్యుదయ చైతన్య వేదిక అధ్యక్షుడు చీపాటి రాజేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ లక్ష్మీనారాయణ రచించన «దీపిక» పుస్తకానికి ఈ అవార్డు వచ్చిందని పేర్కొన్నారు. విమర్శలకు కూడా విమర్శలుండాలని తెలిసిన వ్యక్తి పెనుగొండ అని తెలిపారు.

కన్యకా పరమేశ్వరికి సామూహిక కుంకుమార్చన



కన్యకాపరమేశ్వరి

కడప కల్చరల్: కడప వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ధనుర్మాసంలో వచ్చిన తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారిశాల మహిళా విభాగం ప్రతినిధులు సామూహికంగా ఈ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయంలోని అమ్మవారి వెండి రథంపై అమ్మవారిని కొలువుదీర్చి వేదమంత్రాల మధ్య ప్రాకారోత్సవం నిర్వహించారు. తర్వాత దశ హారతులు ఇచ్చి భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని వినతి



జెడ్పీ సీఈఓ ఓబుళమ్మకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యల పరిష్కారానికి ఒక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని ఎస్టీయూ కడప జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వరరెడ్డి కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఓబుళమ్మను కడప జెడ్పీలోని తమ చాంబర్‌లో కలిసి వారు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పీఎఫ్ సబ్‌క్రిప్షన్ మిస్సింగ్ క్రెడిట్లను పరిశీలించాలని కోరారు. ఫైనల్ పేమెంట్లు చెల్లింపు విషయంలో ఆడిట్ నందు ఎదురవుతున్న ఇబ్బందులు పరిష్కరించాలన్నారు. జెడ్పీ సీఈఓ స్పందిస్తూ త్వరలో ఒక కో ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటుచేసి సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్‌బాబు, రమణారెడ్డి, బాల గంగిరెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామ్మోహన్, పాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు

విద్యుత్తును పొదుపుగా వినియోగించాలి

ఏపీఎస్‌పీడీసీఎల్ ఇంజనీరు ఎస్.రమణ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్తు ఉద్యోగులు

కడప కార్పొరేషన్: విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ పిలుపునిచ్చారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా కడప మునిసిపల్ గ్రౌండ్ నుంచి అప్సర సర్కిల్ మీదుగా డివిజన్ విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇంధన సామర్థ్యం, పరిరక్షణ ప్రాముఖ్యత, విద్యుత్ ఆదా గురించి ప్రజలలో అవగాహన కల్పించుటకు చేసిన ఈ ర్యాలీని ఎస్ఈ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఆదా చేయుటకు ఇంధన పరిరక్షణ చిట్కాలైన స్టార్ రేటెడ్ గృహోపకరణాలు వాడటం, లైట్ల వాడకంలో జాగ్రత్తలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్ల వాడకంలో మెలకువలు తీసుకోవాలన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తిని అభివృద్ధి చేయుటకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా గృహాలకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యుత్ ఆదాపై నినాదాలు చేస్తూ ప్లకార్డులతో ర్యాలీగా ముందుకు సాగారు. ఈ ర్యాలీలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు హరిసేవ్యానాయక్, మధుసూదన్, విజిలెన్స్ ఇన్స్పెక్టర్ పి.నరసింహారెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ హుస్సేన్, అధికారులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల చేయూత



వృద్ధులకు ప్లేట్లు అందజేస్తున్న ప్రిన్సిపల్, పీఓలు

వైవీయూ: కడప నగరంలోని నవ జీవన్ నిరాశ్రయుల వసతి గృహంలోని వృద్ధులకు ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చేయూత అందించారు. ఆశ్రమంలోని 30 మంది వృద్ధులకు దోమ తెరలు, స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు, టిఫిన్ క్యారియర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.వి.సలీం బాషా మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చదువుతోపాటు సేవా దృక్పథంతో వృద్ధులకు చేయూత అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ పేదలకు చేయూతనివ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.జి.విజయలక్ష్మిదేవి, డాక్టర్ పి.శచీదేవి, డా. గురుమోహన్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి



అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: భారత రాజ్యాంగ నిర్మాణ కర్త డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశాస్త్రమైన స్వర్గం, పుణ్యం భాషలు అమిత్‌షా వాడడం చట్ట విరుద్ధమని గుర్తు చేశారు. దేశ సామాజిక సాంస్కృతిక ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా, భారత రాజ్యాంగంలో దేశీయ, రాజకీయ, ఆర్థిక, సాంఘిక అంశాలన్నింటినీ కలిపి చేర్చారన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని గౌరవించే వాళ్లంతా ఐక్యంగా పోరాటం చేసి దేశ భవిష్యత్తును అభివృద్ధి చేయడంలో కృషిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎస్.సుబ్బమ్మ, బి.మనోహర్, జి.శివ కుమార్, బి.దస్తగిరిరెడ్డి, కె.శ్రీనివాసులురెడ్డి, వి.అన్వేష్, పి.చంద్రారెడ్డి, వేంకటేశ్వర్లు, ఎస్.భైరవప్రసాద్, రామకృష్ణారెడ్డి, శివకుమార్, రవి, రాహుల్, నరసయ్య, సురేష్, చాంద్‌బాషా, సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు ఉత్సవం

కడప కల్చరల్: కడప నగరంలోని ప్రముఖ సూఫీ పుణ్యక్షేత్రమైన అమీన్‌పీర్ దర్గాలో కొలువైన 8వ పీఠాధిపతి దాదా ముర్షిద్ అమీన్‌పీర్ సాహెబ్ ఉరుసు ఉత్సవం శనివారం నుంచి నిర్వహించనున్నట్లు దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం గంధం , ఆదివారం ఉరుసు, సోమవారం తహలీల్ ఫాతెహా నిర్వహిస్తారని తెలిపారు.